ఈ పదిహేనువందలమంది తమ పదిహేనువందల నిడుపాటి ఎఱ్ఱటిటోపీలుపెట్టి దిరీసువేసుకొంటూ, జోళ్ళు తొడిగారు, తిరుగ ఎక్కడకో వెళ్ళడానికి : ఎక్కడో కాపలా కాయడానికి.

ఈ లోపున ఒకగాలి వీచింది. ఆ చెట్టుయొక్క ఎఱ్ఱటి పళ్ళు వాళ్ళతలమీదపడి కాళ్ళముందు నిల్చాయి. వెంటనే వాళ్ళు ఆ ఎఱ్ఱటి మట్టిపళ్లను తమ నల్లటి జోళ్ళతో నలగ ద్రొక్కి మఱీ ధరించారు తమ ఎఱ్ఱటోపీలను.

"ఏమర్రా ! మీ యెఱ్ఱటోపీలను నెత్తిమీద పెట్టుకున్నారు. ఈ యెఱ్ఱటి మట్టి" పళ్ళను మట్టేశారు. ఇదా మీరు నేర్చిన పాఠం ? అని అడిగాను. పదిహేనువందల మంది పోలీసులు నా వైపు తమ తమ తుపాకులయొక్క విచ్చుకత్తుల్ని చూపిస్తూ "మిమ్మల్ని అడ్డమడి అసలు ఇలా ఎవరురమ్మన్నారూ ?" అని ప్రశ్నించారు.

"ఎఱ్ఱటి పళ్ళను ఏరుకోవడానికి" అని జవాబుచెబుతూ నిష్క్రమించాను.

.... .... .... .... ....

## అగసాలె కుంపటి

అనగనగా ఓ శ్రీకృష్ణపట్నంలో విశ్వకర్మ వీరబ్రహ్మం అనే అతనికి గొప్పకర్మయోగి అని ప్రతీతి. ఆ ప్రతీతి వింటూరాగా పరాయివూళ్లో అగ్రకులస్తులైన వేదాంతం పరబ్రహ్మంగారనే ఆయనకు ఓమాటు ఎవరా యీ వీరబ్రహ్మంగారు అని చూడ బుద్ధిపుట్టింది.

వీరబ్రహ్మం అగసాలెకు వేదాంతం పరబ్రహ్మంగారు విచ్చేశారు. వీరబ్రహ్మం లేచి బ్రాహ్మణోత్తములకు నమస్కారంచేసి వచ్చిన కారణం అడిగేడు. అంటే వేదాంతం పరబ్రహ్మంగారన్నారు "మిమ్మల్ని చాలా కర్మ తాపత్రయులుగా భావించి లోకం మిక్కిలీ జాలిపొందడం వింటూవచ్చాను. అంచేత మిమ్మల్ని వేదాంతులుగా చేయాలనే సంకల్పం పుట్టింది నాకు" అన్నారు వేదాంతం పరబ్రహ్మంగారు. వీరబ్రహ్మం వెంటనే తలొంచుకొని తనమానాన తనసుత్తితో తనసానమీద బంగారపురేకు సాగేసుకుంటూ వున్నాడు వీరబ్రహ్మం ముందు వాక కుంపటి వుంది. అది ఊకనే రగుల్తూవున్న బొగ్గులతో తేజరిల్లుతూవుంది. పక్కనే చింతపండు మెఱుగిసుక కుంకుడు కాయ ఇత్యాదు లేవేవో కలిపివున్న పెంకువుంది. వేదాంతం పరబ్రహ్మంగారు ఆ కుంపటీ ఆ కుండపెంకూ అమాంతంగా ఎత్తి వీధిలో ఓమూలకు గిరాటేసి వెళ్ళిపోయినారు.

అలా చేయడంలో వేదాంతం పరబ్రహ్మంగారి అభిప్రాయం ఏమిటో వూహించండి పాఠకులు!

ఏమిటంటే—వీరబ్రహ్మానికి "ఆ బంగారప్పని శాశ్వతం గాదని ఆ పనేకాకుండా ఏ శరీరం కూడా శాశ్వతం గాదనీ వేదాంత పరిజ్ఞానం వొక్కటే శాశ్వతమనీ సూచనగా చెప్పాడన్నమాట ఆ సాహసకార్యంచేసి ఆ వేదాంతి.

విశ్వకర్మ వీరబ్రహ్మం తలెత్తి చూచేడు. కోపం తెచ్చుకోలేదు. తన కుంపటప్పటిది పగిలిపోయిందని వగవలేదు. వెంటనే తన దుకాణంమీదికున్న కొట్టుగది తీసి అందులోవున్న మఱోపగిలిన కుండయొక్క ముక్కైతోను, మఱోకుండయొక్క

మట్టుతోను, మతోకుండయొక్క పెంకుతోను, తనకువలసిన పరికరాలమర్చుకొన్నాడు పనిసాగించుకుంటూవున్నాడు.

మర్నాడు మళ్ళీ వచ్చారు వేదాంతం పరబ్రహ్మంగారు. వస్తే ఎప్పట్లాగే పని చేసుకుంటూ వున్నాడు విశ్వకర్మ వీరబ్రహ్మం వేదాంతం పరబ్రహ్మంగ్గారు వీరబ్రహ్మం యొక్క పనితనం చూస్తూనే మళ్ళీ మర్నాడుకూడా అలాగేచేసి వెళ్ళిపోయినాడు. దానికిన్నీ విశ్వకర్మ వీరబ్రహ్మం కించిత్తూ నసక్క బెసక్క తనకొట్టుగది తీసికొని మతోకుంపటి అమర్చుకున్నాడు.

వేదాంతం పరబ్రహ్మంగారు మూడోనాడు వచ్చారు. వచ్చి అదే పని చేయబోయి.—ముక్కలైన పాతకుంపటా అది, లేకపోతే కొత్తగా కుండపగలగొట్టి అమర్చుకొన్న కుంపటా అని ఎగాదిగాచూచేరు. విశ్వకర్మ వీరబ్రహ్మం వేదాంతం పరబ్రహ్మంగారికేసి చూచి స్వామీ! ఏమిటి పరిశీలిస్తున్నారు?" అన్నాడు. అంటే వేదాంతం పరబ్రహ్మంగారు, "ఓయి! వీరబ్రహ్మం! రోజూ ఒకకొత్తకుండ పగలగొట్టి ఇలాగ్గా కుంపటి చేసేప్పుడన్నా నీకు వేదాంతం తోచడం లేదోయి? ఈ ప్రపంచం అశాశ్వతం అని తట్టడం లేదుటోయి?" అన్నాడు.

"ఎందుకు తట్టాలి?" అన్నాడు వీరబ్రహ్మం "ఎందుకా? చూడు!" అన్నారు వేదాంతం పరబ్రహ్మంగారు. వెంటనే కుంభకారునింటికి మనిషిని పంపించి ఒకకొత్తకుండ తెప్పించారు, తెప్పించి ఆ కుండనల్లా విశ్వకర్మ వీరబ్రహ్మానికి చూపించేరు. చూపించి అనేరు "వీరబ్రహ్మం! ఈ కుండలో చూడు! ఏముంది? ఏమీలేదు ఘటాకాశం వుంది. ఇది పగల

కొడితే ఏమౌతుంది? ఘటాకాశం మహదాకాశంలో కలిసి పోతుంది? అవునాకాదా?" అని ఆ కుండ పగలగొట్టి "ఇంత మాత్రపుదే మనజన్మ" అన్నారు. వీరబ్రహ్మం ఆ మాట వినిపించుకోకుండానే తనకొట్టుగది తీసినటువంటివాడై, అదివరకు తనకొట్టునిండా వున్న పగిలిన భాండాల్లోకి యీ వేదాంతం పరబ్రహ్మంగారు పగలగొట్టిన కొత్తకుండయొక్క ముక్కముక్కల్ని కూడా విసిరేడు.

వేదాంతం పరబ్రహ్మంగారు ఆ వీరబ్రహ్మం ఆలా విసరడంలో కొట్టుకేసి చూచి ఆ కొట్టునిండావున్న పగిలినకుండల యొక్క అసంఖ్యాకపు ఖండఖండాల్ని కనిపెట్టి ఆశ్చర్యపోయారు.

"అయితే రోజూ నీవొక కొత్తకుండ పగలగొట్టటంలేదు? నేను కుంపటివిసరేసినప్పుడల్లా?" అని అడిగారు పరబ్రహ్మంగారు వీరబ్రహ్మన్ని. "లేదండీ" అన్నాడు వీరబ్రహ్మం. "ఈ కుండ ముక్కలన్నీ నా సొంతం సుమండీ" అన్నాడు కూడాను.

వేదాంతం పరబ్రహ్మంగారికి నిండాఆశ్చర్యం వేసి పోయింది ఆ పల్కుతో.

అప్పుడిలా చెబుతున్నాడు వీరబ్రహ్మం తన గాథ.—

నన్ను పుట్టించిన బ్రహ్మదేవుడు దగ్గఱ అసలు మూడు భాండాలు వుండేవి అమృతభాండం, జలభాండం, వాయుభాండమున్నూ—నన్ను పుట్టించినప్పుడే మిమ్మల్ని పుట్టించేడు బ్రహ్మదేవుడు మీరు మఱచిపోయినారేమో—అప్పుడు బ్రహ్మదేవుడు మీకూనాకూ కూడా మూడు భాండాలూ చూపించి యీ మూడుభాండాలు ఎలాగ్గా ఉపయోగిస్తారు అని అడిగేడు.

అడిగితే మీరు మూడింటికి వొకే సమాధానంగా ఘటాకాశం మహదాకాశం అని ముందుగా వాయుభాండం పగలగొట్టేరు. బ్రహ్మ "నడవ్వయ్యా! ఇక్కడవుంటే తక్కినవికూడా పగల గొట్టగలవు" అని మిమ్మల్ని ముందు కిందకు తోసేసేడు; ఆ కారణంచేత మీ రబ్రగవర్ణంవారయి వేదాంతం పరబ్రహ్మంగారయి పోయినారు భూమ్మీద; నేను మీరు పగలగొట్టిన ఆ వాయు భాండం యొక్క ముక్కలు జాగర్తచేసేను. అప్పుడే జాగర్త చేసేను. బ్రహ్మ "ఎందుకు ఆ ముక్కలు తీస్తావు?" అన్నాడు. అంటే కుంపటిచేసి అందులో బంగారం కరగేస్తాను అన్నాను. బంగారానికి మెఱుగెడతానన్నాను. భేషైన కర్మిష్ఠివి నీవు జల భాండంకూడా పుచ్చుకోమన్నాడు. పుచ్చుకోమంటే జలభాండం పుచ్చుకుచూశాను. నీళ్ళు వంచితే అదీ వాయుభాండం అయిపోయే టట్టు కనబడింది అప్పుడు అది మీకంటబడితే కఱ్ఱదెబ్బ తినగల దని కిందకు దాన్ని తెచ్చి కుండల మరలో జతపఱచి ఓ నూతి మీద మా తోటకమర్చాను. అప్పుడా నూతిలోనీళ్ళు ఊరింపు కుంటూ అదే తిరగడం తిరగడం! మఱి బ్రహ్మదేవుడు ఆ నా కుశాగ్రబుద్ధికి మెచ్చుకుని "మొక్కలకు జీవం వచ్చింది వోయి నీ చర్యవల్ల యీ అమృతభాండం పుచ్చుకో" యన్నాడు. వెంటనే ఆ అమృతభాండం స్వీకరించి అది చిన్న చిన్న కుండ ల్లోకి దీసి రసవిష గంధకాదులతోనూ వండి కుప్పెలుకట్టి ఆయుర్వేద వైద్యం ప్రారంభించాను. చూడండీ మీ వేదాంతు లైతే పగలగొట్టివుందురు ఆ పాళంగా దాన్ని—"

వేదాంతం పరబ్రహ్మంగారు విశ్వకర్మ వీరబ్రహ్మంగా రలా చెబుతూవుంటే వింటూ అడిగేరు. "మఱి కుండలమఱలో

తాడు తెగి కుండలు కిందపడి చితికితే? రసవిష గంధకాదులు వండినప్పుడు ఆ మందులు కుండనంటుకు చిట్లంకట్టుకుపోగా నీవు గోకడంలో కుండలు పగిలిపోతే?"

వీరబ్రహ్మం వెంటనే అన్నాడు. "ఆలా పగిలిన కుండల పెంకులన్నీ, కుండల మూతులన్నీ, కుండల మట్టులన్నీ యీ కొట్లోకి జేరేసుకున్నవాజ్జై మీ వేదాంతులు వచ్చినా అగసాలెలో ఓ కుంపటి లాగేస్తే మతోకుంపటి అమారుచేసు కుంటూ వుంటాను" అన్నాడు.

"ఎంతమంది వేదాంతులొచ్చినా అతని కుండపెంకు లన్నిటినీ, కుండమట్టులన్నిటినీ, కుండముట్టైలన్నింటినీ, అవతల పారవేయలేదనీ, పారవేసినకొద్దీ అవి ఊరతాయనీ, ఎక్కడ పారవేస్తే అక్కడే దారి కడ్డుపడతాయనీ ఊహించుకుంటూ "ఈ కుండల ఖండాల్ని కుంపట్లగా ప్రజ్వలింపజేయడమే లోకాని కుపకారము" అనీ తలపోసికుంటూ వెళ్ళిపోయినారు. వేదాంతం పరబ్రహ్మంగారు, విశ్వకర్మ కృషి కీర్తిస్తూ.

వాయుభాండా లెన్ని చితికిపోయి తొక్కుడుబిళ్ళలుగా మారిపోయి అడుగంటిపోయినా, కుండల మఱలు ఎన్నికూలి పోయినా, అమృతభాండాలెన్ని ఆఖరు అయినా, విశ్వకర్మ వీరబ్రహ్మం యొక్క కుంపటిని మఱి తీసిపారవేసిన వేదాంతి లేడు. అదే చిరస్థాయిగా లోకలో నిల్చిపోయింది.

.... .... .... .... ....

## పల్లమ్మ

పల్లమ్మ కనక గ్రీసుదేశంలో స్పార్టాఏథెన్సు మున్నగు పట్నాల యొక్క ఉచ్ఛలోపుట్టి పెఱిగి వుండే ఒక చక్కని శిల్పపుచేత